క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి



మండవల్లి: మండలంలోని భైరవపట్నం జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్.పుష్పలత తెలిపారు. భైరవపట్నంలో శనివారం హౌసింగ్ డే ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల స్పెషల్ ఆఫీసర్ పుష్పలత మాట్లాడుతూ.. జగనన్న కాలనీలో 176 మంది లబ్ధిదారులకు నివేశన స్థలాలు అందజేసి, నిర్మాణాలకు రూ.1 లక్షా 80 వేలు రుణం, ఉచితంగా ఇసుక, సబ్సిడీపై మెటల్, సిమెంట్ అందజేస్తున్నామన్నారు. హౌసింగ్ డీఈ ఆర్.రమణమూర్తి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 36 మంది గృహ నిర్మాణాలు పూర్తి చేశారని, మరో 69 మంది నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉందన్నారు. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఏఈ వీవీఎస్ శేఖర్, సర్పంచ్ సామ్రాజ్యవాణి, ఎంపీటీసీ ఎన్ కిరీటిరాజు, హౌసింగ్ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



కైకలూరు(కలిదిండి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే డీఎన్నార్ చెప్పారు. కలిదిండి మండలం పెదలంకలో శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి రాజు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన జంగం దావీదు, చాబత్తిన అభిమన్యు, ముప్పల రాజు పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు.

'పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన' చెక్కు పంపిణీ

మండవల్లి: పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. ఇటీవల మృతి చెందిన గంగునేని చిన్నారావు భార్య ప్రసూషకు శనివారం రూ.2 లక్షల చెక్కును సర్పంచ్ మెండా ఝాన్సీ చేతులమీదుగా అందజేశారు. సభకు ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలపై మేనేజర్‌తో కలిసి భాస్కరరావు అవగాహన కల్పించారు. జీవనజ్యోతి బీమా యోజనలో 18 నుంచి 50 ఏళ్లు ఉన్న బ్యాంకు ఖాతాదారులంతా చేరవచ్చన్నారు. నాయకులు మెండా సురేష్, బ్యాంకుమిత్ర ఝాన్సీరాణి, ఎలిమేటర్లు తెంటు శ్యామల, ఎస్.జానకి, డ్వాక్రా మహిళలు, వలంటీర్లు పాల్గొన్నారు.

నిమ్మకూరులో అన్నదానం

నిమ్మకూరు(పామర్రు): గ్రామంలోని తిరుమల తిరుపతి దేవస్థానం పర్యవేక్షణలో నిర్వహిస్తున్న పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతి శనివారం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ధర్మారెడ్డి తెలిపారు. స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు తీర్థప్రసాదంతో పాటు అన్న ప్రసాదాన్ని అందజేశామన్నారు. ఆలయ అర్చకులు సుదర్శనం యోగానంద లక్ష్మీ నరసింహాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలి

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శనివారం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన అన్ని అంశాలను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే కైలే మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లోని గృహ నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ఏవిధమైన అడ్డంకులు లేకుండా చురుగ్గా పనులు పూర్తి చేయాలని చెప్పారు. పంచాయతీలు ప్రగతి పథంలో పయనించే విధంగా స్థానికంగా ఉన్న అంతర్గత రహదారులు, డ్రెయినేజీ తదితర వ్యవస్థలకు సంబంధించిన పనులను సకాలంలో చేయాలని ఆదేశించారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయం..

నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో 2021–23 వరకు మొత్తం 43 పనులను సుమారు రూ.2.01 కోట్ల నిధుల ఎస్టిమేషన్‌తో పనులు ప్రారంభించామని ఎమ్మెల్యే చెప్పారు. ఇప్పటి వరకు సీసీ, జీఎస్బీ పనులు 32 పనులు రూ.1.06 కోట్లతో పూర్తి చేశామన్నారు. గ్రామంలో మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎంపీ నిధులతో పాటు గడగప గడపకు మన ప్రభుత్వం నిర్వహణ ద్వారా ఒక్కో సచివాలయానికి రూ.20లక్షలు మొత్తం కలిపి రూ.78.08 లక్షల నిధులు మంజూరుతో గ్రామాల్లో 23 రోడ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని తెలిపారు. ఇప్పటి వరకు ఆరు రోడ్లు పూర్తయ్యాయన్నారు. మిగిలిన రోడ్ల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తగు విధమైన చర్యలు తీసుకుంటోందన్నారు. నవరత్న పథకాల ద్వారా అన్ని వర్గాల్లోని పేదలైన వారికి అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తున్నామని చెప్పారు. రానున్న కాలంలో ప్రభుత్వం పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందజేయటంలో స్థానిక పార్టీ నాయకులకు అధికారులు తగు విధమైన సహాయ సహకారాలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు కె.కస్తూరి, డి.బాల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ వై.రామకృష్ణ, డెప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వరరావు, ఆర్ఐ అనిల్, గ్రామ కార్యదర్శి సలీం, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)



పెదలంకలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు(కలిదిండి): గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. కలిదిండి మండలం పెదలంక గ్రామ శివారు దళితవాడ, అప్పారావుపేటలో 181వ రోజు గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం శనివారం జరిగింది. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలో అంబేడ్కర్, దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే డీఎన్నార్ ఆయా శాఖల అధికారులకు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ఐనాల బ్రహ్మాజీరావు, వైస్ ఎంపీపీ కూసంపూడి కనకదుర్గా రాణి, ఏలూరు జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, గ్రామ సర్పంచ్ మోకా లక్ష్మి, సర్పంచ్‌లు బత్తిన ఉమామహేశ్వరరావు, ద్రోణాద్రి నాగలక్ష్మి, జయమంగళ కాసులు, మహదేవ్ విజయ్ బాబు, నరహరిశెట్టి నరసయ్య, ఎంపీటీసీ సభ్యులు ఇమ్మానేని లక్ష్మణరావు, రావాడి బాలు, సేవాకుల పద్మ, పేటేటి రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షులు పోరిపిరెడ్డి శ్రీనివాసరావు, అంకెం నరసయ్య, ఎస్ఐ మణికుమార్, విద్యుత్‌శాఖ ఏఈ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి నాగబాబు, వీఆర్వో సుబ్రహ్మణ్యం, గ్రామ సచివాలయ కన్వీనర్లు, సహాయకులు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా విద్యుత్ లైన్‌మేన్ దివస్

కైకలూరు(కలిదిండి): స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద జాతీయ విద్యుత్ లైన్‌మేన్ దివస్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఏఈ మల్లికార్జున సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా మార్చి 4న జాతీయ లైన్‌మేన్ దివస్(విద్యుత్ భద్రతా వారం)గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. లైన్‌మేన్లు, సిబ్బంది తమ పరిధిలోని వినియోగదారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని కోరారు. విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతులుగా ఎదగాలి

ఘనంగా మొవ్వ జెడ్పీహెచ్‌ఎస్ 77వ వార్షికోత్సవం



విద్యార్థినికి ప్రోత్సాహక నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, ప్రజాప్రతినిధులు

మొవ్వ: విద్యార్థులు ఉన్నతులుగా ఎదగాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సూచించారు. మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని శ్రీమండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 77వ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే కైలే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం ఎస్వీ శ్రీధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విద్యలో ఉన్నతులుగా మారాలనే దృఢ నిశ్చయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకవస్తున్నారన్నారు. ఈ సందర్భంగా చదువులో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. పాఠశాలలో విద్యాభ్యాసం చేసి ఉన్నతులుగా ఎదిగి ఆదర్శప్రాయంగా నిలిచిన పూర్వ విద్యార్థులను సత్కరించారు. ముందుగా మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి నాట్యకళాపీఠంలో జరిగిన పీపుల్స్ యాక్షన్ ఫర్ రూరల్ ఎవేకింగ్(పారా) కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కొండేటి ఇందిర, వైస్ ఎంపీపీ కందుల వెంకట కోటేశ్వరరావు, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, పార్టీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, మొవ్వ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, మండవ నీలవేణి పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు



గుడివాడటౌన్: కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గుడివాడ కార్యదర్శి డి.సరస్వతి తెలిపారు. స్థానిక ఎస్పీఎస్ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ నైతిక విలువలుపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో భవిష్యత్‌కు విద్యే మార్గమని, దాని విలువను విద్యార్థులకు తెలియజేసే లక్ష్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 9వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరికి నగదు ప్రోత్సాహం అందజేశారు. 10వ తరగతిలో మరింత కష్టపడి ఉత్తమ మార్కులు సాధిస్తే ప్రోత్సాహకాలు ఇంకా అధికంగా ఇస్తామన్నారు. మానవత డైరెక్టర్ దండమూడి సీతారామస్వామి, చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, హెచ్ఎం టీఎంఈ రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీకేఆర్ ఫెస్ట్



గుడివాడటౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న వీకేఆర్ ఫెస్ట్ 2023 శనివారం రెండోరోజు కూడా కొనసాగింది. జిల్లాలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 130 మంది, వీకేఆర్ కళాశాల నుంచి 160 మంది విద్యార్థులు ఈ ఫెస్ట్‌లో పేర్లు నమోదు చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. టెక్నికల్ ఎక్స్‌పో, క్విజ్, రోబో ఫెస్ట్, ఎలక్ట్రానిక్ స్కెచ్, టాలెంట్ టాకీస్, కొరియోగ్రఫీ, లోగో డిజైన్, యంగ్‌మేనేజర్, షార్ట్‌ఫిలిం, కోడింగ్, డీకోడింగ్, నేచర్ ఫొటోగ్రఫీ తదితర ఈవెంట్‌లలో విజేతలకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, ప్రిన్సిపాల్ సీహెచ్‌వీ ప్రసాదరావు, డైరెక్టర్ బి.కల్యాణ్ కుమార్, ఫెస్ట్ కన్వీనర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

రామలక్ష్మి మృతి తీరని లోటు

పామర్రు: తెలుగు సినీ రంగంలో తన సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించిన రచయిత కె.రామలక్ష్మి మృతి తెలుగు సాహితీ ప్రపంచానికి తీరని లోటని పామర్రు ఎస్పీ బాలు కల్చరల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సొపాటి బెనర్జీ, వీరంకి బుల్లెయ్య శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ అనేక కథలు, రచనలు చేసిన ఆమె తొలి కథా సంపుటి 'విడదీసే రైలు బళ్లు' మొదలు కొని 'చీలిన దారులు' వరకు అనేక గొప్ప రచనలు చేశారన్నారు. రామలక్ష్మి మృతి స్త్రీ వాదులు, మహిళా లోకానికి తీరని లోటని చెప్పారు. ఆమె మృతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ది పామర్రు కళా పరిషత్ అధ్యక్షుడు నూతలపాటి త్రివిక్రమరావు, స్థానికులు సతీష్, శ్రీనివాస్, తిరుమలరావు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న జాతర



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పామర్రు: వారం రోజులుగా జరుగుతున్న స్థానిక గంగానమ్మతల్లి ఆలయ జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగుస్తాయని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బొమ్మారెడ్డి వెంకట రామిరెడ్డి తెలిపారు. జాతరలో భాగంగా శనివారం అమ్మవారిని స్థానిక కోటిరెడ్డి పేట, చౌదరి పేట, గాంధీనగరం, విజయవాడ రోడ్డు, మూలమలుపులు తదితర ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి చద్ది నివేదనలను సమర్పించి పసుపు కుంకుమలతో పూజలు చేసి మొక్కుబడులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ.. వేల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టామన్నారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు పోలీస్‌శాఖ వారి సహకారాన్ని కోరామని చెప్పారు. సభ్యులు నందిపాటి బాలసుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, డి.బాల వెంకటేశ్వరరెడ్డి, బి.రాజేష్‌రెడ్డి, గుజవర్తి చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.అంజిరెడ్డి, భీమవరపు శ్రీనివాసరెడ్డి, సరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, మున్నంగి వెంకటరెడ్డి, దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవాలు ప్రారంభం



ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం శ్రీగంగాపార్వతీ సమేత శ్రీఅమృతేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచన, దీక్షారంభం, అగ్నిప్రతిష్ఠ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పెండ్లికుమారుడు అమ్మవారిని పెండ్లికుమార్తెగా చేసి పూజలు చేశారు. స్వామి అమ్మవార్లకు కల్యాణం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ కంతేటి వరలక్ష్మి, కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

లక్ష్మీనృసింహ ఆలయంలో..

సింగరాయపాలెం లక్ష్మీనృసింహస్వామి ఆలయ కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలంకరించి పూజలు చేశారు. ఉత్సవాలకు సంబంధించి ఆలయం వద్ద పలువురు వేద పండితుల ఆధ్వర్యంలో శనివారం సుదర్శనయాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు, చైర్మన్ మీగడ నెలబాలుడు, బోయిన రామరాజు, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

214 మందికి వైద్య పరీక్షలు

గుడివాడటౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో శనివారం 7వ వార్డు కొత్తపేటలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. బి.పి., సుగర్, ఈసీజీ, 2డీ ఎకో, కంటి పరీక్షలు చేశారు. శిబిరంలో 214 మందికి పరీక్షలు నిర్వహించగా 18 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించామన్నారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంవీ నారాయణరెడ్డి, క్లబ్ గౌరవ అధ్యక్షుడు పర్వతనేని చంద్రశేఖర్, క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాద్, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, బొగ్గారపు తిరుపతయ్య పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

ముదినేపల్లిరూరల్: గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. మండలంలోని దేవపూడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు శేషపు మహంకాళిరావు మాట్లాడుతూ పెరిగిన వంట గ్యాస్ ధరలతో కార్మికుల జీవితాలు తారుమారు అయ్యాయన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పథకం బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఏలూరు నుంచి కైకలూరు, కోరుకొల్లు, నడుపూరు మీదుగా కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నానికి ఆర్టీసీ బస్సు నడపాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నేత ఉల్లంకి నాంచారయ్య, వ్యవసాయ శాఖ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జక్కుల మహేష్, మండల కార్యదర్శి చిన్నం మాధవ, కార్యకర్తలు మట్లపూడి కనకారావు, బోయిన కృష్ణ, బోయిన రాంబాబు, పి.యాకోబు పాల్గొన్నారు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ల అందజేత



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బిందు

పామర్రు: గ్రామంలోని సచివాలయం 3 పరిధిలోని పింఛన్ లబ్ధిదారురాలు కనుమూరి ధనలక్ష్మి కొద్ది రోజులుగా చిన్నఅవుటపల్లి పిన్నమనేని సిద్దార్థ మెడికల్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించుకుని వైద్య సేవలు పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ బిందు శనివారం హాస్పిటల్‌కు వెళ్లి దివ్యాంగుల పెన్షన్‌ను అందజేశారు. ధనలక్ష్మి కుటుంబ సభ్యులు వలంటీర్‌ను అభినందించారు.



పాపారావుకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ సువార్త వాణి

విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి..

గుడ్లవల్లేరు: కౌతవరం 8వ వార్డుకు చెందిన నరెడ్డి పాపారావు అనారోగ్యంతో బాధ పడుతూ విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో 10 రోజులుగా చికిత్స పొందుతున్నాడు. ఆయన పరిస్థితి గమనించి శుక్రవారం విజయవాడకు వెళ్లి పెన్షన్ అందజేసినట్లు వలంటీర్ సదర్ల సువార్త వాణి తెలిపారు. వలంటీర్‌ను పాపారావు కుటుంబ సభ్యులు అభినందించారు.

ప్రభుత్వం బకాయిలు చెల్లించాలి

పెదపారుపూడి: మండల పరిషత్ కార్యాలయంలో ఏపీజీఈఏ పామర్రు, పెదపారుపూడి మండలాల తాలూకా ఉద్యోగ సంఘాల చర్చా వేదిక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పి.రాము మాట్లాడుతూ.. ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పామర్రు, పెదపారుపూడి తాలూక యూనిట్ అధ్యక్షుడు కె.ఏసుబాబు, సహాయ అధ్యక్షుడు ఎం.నాగిరెడ్డి, కార్యదర్శి సాయిప్రసాద్, ట్రెజరర్ శివ నాగమణి, ఉపాధ్యక్షుడు చాట్ల అజయ్‌కుమార్ పాల్గొన్నారు.